క్లుప్తంగా

నేడు క్యాండిల్ ర్యాలీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం హెచ్ఐవీ మృతుల ఆత్మకు శాంతి కలగాలని, క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని, అక్కడే మానవహారం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో నాణ్యమైన వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తోందని స్థానిక పీహెచ్సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్సీ పరిధిలో 60 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా క్షయ నివారణకు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. దీని మూలంగా క్షయ రాదని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తేజ, ఇందుమతి, నరసమ్మ, నిరోషా పాల్గొన్నారు.

47 మందికి వైద్య పరీక్షలు

తవణంపల్లె: గ్రామీణ పేదల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భవతులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎస్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల సమయంలో తేలికపాటి చినుకులతో ప్రారంభమై, ఆపై జోరుగా పడింది. దీంతో రోడ్లంతా జలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.

ఘనంగా శైలజారెడ్డి జన్మదిన వేడుకలు



శైలజారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పూతలపట్టు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, రాయలసీమ రీజినల్ చైర్మన్ శైలజా చరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అగరంపల్లిలోని ఆమె నివాసంలో ఆత్మీయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో ఆమెను సన్మానించారు. అనంతరం ఆమె కేకు కట్‌చేశారు. ఐరాల అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ లోకేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంగజాతరకు శరవేగంగా ఏర్పాట్లు



కొంగారెడ్డిపల్లి జాతరకు మండపం ఏర్పాటు చేస్తున్న దృశ్యం



నడివీధిలో జాతర ఏర్పాట్లు

- ఎన్నికల కోడ్‌ను అనుసరించి ఈ నెల 21, 22 తేదీల్లో జాతర
- జాతర నిర్వహణకు సిద్ధమవుతున్న మండపాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులో గంగ జాతర సందడి నెలకొంది. వాడవాడలా మండపాలు సిద్ధమవుతున్నాయి. నిర్వహణ పనుల్లో జాతర పెద్దలు నిమగ్నమయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో జాతరకు ముహూర్తం ఖరారైంది. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం చాటింపు వేశారు. పొంగళ్లు పొట్టి శాంతి పూజలు చేశారు. ఎన్నికల కోడ్‌కు అనుసరించి జాతర పనులు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పూర్తి స్థాయిలో పోలీసులు నిఘా పెట్టారు. చిత్తూరు గంగజాతర మండపం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజులుగా ఏర్పాటు పనులను జాతర నిర్వాహకులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చే ప్రాంతంలో మండపం ఏర్పాటు చేయడంతోపాటు భక్తుల రద్దీ దృష్ట్యా మండపం ఆనుకుని భారీ స్థాయిలో పందిరి వేయిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూల ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. మండపం పైభాగంలో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. నడివీధి దారిపొడవునా శరవేగంగా జాతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలో జాతర సందడి నెలకొంది.

నగరంలోని పలు ప్రాంతాల్లో..

కొంగారెడ్డి పల్లి ప్రాంతంలో కూడా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంతపేటలో కూడా మండపం పెద్ద స్థాయిలో ఏర్పాటవుతోంది. గిరింపేట, మురకంబట్టు, దొడ్డిపల్లి, ఓబనపల్లి తదితర ప్రాంతాల్లో కూడా జాతర పనులు సాగుతున్నాయి. 20వ తేదీ సాయంత్రం కల్లా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జాతర పెద్దలు తీర్మానించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జాతర నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర పెద్దలు జాగ్రత్త పడుతున్నారు. కోడ్ నిబంధనలు పాటిస్తున్నారు.

నేడు గంగమ్మ ఆభరణాల ప్రదర్శన

నగరంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే నడివీధి గంగజాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆభరణాలను ప్రదర్శించనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. నగరంలోని బజారు వీధిలో ఉన్న గీతా మందిరంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆభరణాలను వంశపారంపర్య ధర్మకర్తలచే ప్రదర్శన ఉంటుందని వారు పేర్కొన్నారు.

చేతినిండా పని

పందిరి వేసే కార్యక్రమం నుంచి అమ్మవారి నిమజ్జన ఏర్పాట్ల వరకు ఆయా వృత్తుల వారికి చేతినిండా పనులు దొరుకుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, వీధినాటకాలు, అమ్మవారి గజమాల, మండపం అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, డప్పు వాయిద్యాలు ఇతరత్రా వాటికి ముందస్తు బుకింగ్ చేసుకుంటారు. ఓంశక్తి భక్తుల దీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. ఆయా మండపాల వద్ద గంగమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని చూస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. వేలాది మందికి అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొత్తానికి ఈ సారి జాతర భారీ అంచనాలతో ముందుకు రానుంది.

పోలీసుల నిఘా

ఎన్నికల పోలింగ్ ముగియడం తర్వాత జాతర ఖరారు కావడంతో చిత్తూరులో వాతావరణం వాడివేడిగా కనిపిస్తోంది. మండపాల వద్ద ఎన్నికల ప్రభావంతో గొడవలు, అల్లర్లు జరగవచ్చని పోలీసులు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి నుంచే పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. పకడ్బందీగా భద్రత చర్యలు చేపట్టనున్నారు. అన్ని మండపాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నారు. ముందస్తుగా అనుమతులు తప్పనిసరి చేశారు.

డాక్టరేట్ ప్రదానం



సేవా డాక్టరేట్ అందుకుంటున్న విజయసింహారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: వివిధ మండలాల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తహసీల్దార్‌గా చేసిన సేవలకు గాను రిటైర్డ్ తహసీల్దార్ విజయసింహారెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. బెంగళూరులో భారత్‌వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం ఆయనకు సేవా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన మాజీ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు. సేవా డాక్టరేట్ పొందిన ఆయనను పలువురు అధికారులు, కుటుంబీకులు అభినందించారు.

రేపు విజ్ఞానసుధలో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో సీఎంటీ రోడ్డులో ఉన్న విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చైర్మన్ శ్రీధర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఎంపికయ్యే వారికి సంవత్సరానికి రూ.1.8 లక్షలు జీతం వస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 9493210966 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కొండెక్కిన కోడి ధర



- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.240 నుంచి రూ.260
- దుకాణదారులు రూ.160 కొని అధిక ధరకు విక్రయం

గుడిపాల: కోడి కూరలకు రెక్కలు వచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. నిన్నటి వరకు రూ.160 పలికిన చికెన్ అమాంతం రూ.240 నుంచి రూ.260 కి చేరింది. దాణాతో పాటు కోళ్ల ఫీడింగ్‌కు అందించే మందులు, రవాణా చార్జీల భారాన్ని వ్యాపారులు కొనుగోలుదారులపై వేస్తున్నారు. ఫామ్‌లలో పెంపకానికి తెచ్చే కోడి పిల్లల ధరలు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పెంపకం దారులంటున్నారు. ఆరు నెలల క్రితం రూ.20కి లభించే పిల్లలు నేడు రూ.45కి కొనాల్సి వస్తుందని చెబుతున్నారు.

3,500కు పైగా కేంద్రాలు

జిల్లాలో సుమారు 150 కోళ్ల పెంపకం కేంద్రాలున్నాయి. సుమారు 3,500కి పైగా చికెన్ సెంటర్‌లున్నాయి. జిల్లా కేంద్రంలోనే 300కు పైగా విక్రయ కేంద్రాలున్నాయి. రోజువారీ జిల్లా వ్యాప్తంగా 30 టన్నులకు పైగా కోళ్ల అమ్ముడవుతున్నాయి. ఆదివారం, పండుగ రోజుల్లో 35 నుంచి 45 టన్నులు చికెన్ విక్రయాలు జరుగుతున్నాయి. కిలో కోడిని రూ.150కి కొన్న వ్యాపారి రీటైలర్స్‌కి రూ.12 లాభంతో కలిపి రూ.162కి విక్రయిస్తున్నారు. రీటైలర్స్ కిలో కోడిని క్లీన్‌చేసి రూ.240 నుంచి రూ.260 వరకు విక్రయిస్తున్నారు. కిలో చికెన్‌పై 80 నుంచి రూ.90 వరకు అదనంగా చేర్చి అమ్ముతున్నారు. దుకాణాల అద్దెలు, గ్యాస్, క్లీనింగ్, కూలీల ఖర్చు, అద్దెపోను తమకు రూ. 20 నుంచి రూ.30 వరకు మిగులుతోందని విక్రేతలంటున్నారు.

పెరిగిన ధరలు

సాధారణంగా వేసవికాలంలో చికెన్ ధర తగ్గుతుంది. ఈ సారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. రెండు కిలోల బరువు పెరగడానికి కోడిని పెంపకం దారుడు 45రోజుల పాటు సంరక్షించుకోవాలి. వేసవిలో మేత సరిగ్గా తినవు. దీంతో బరువు పెరగడానికి 60 రోజుల సమయం పడుతుంది. బ్రాయిలర్ కోడి మేతలో ప్రధానమైన సోయాబీన్ ధర నెలరోజుల వ్యవధిలో కిలోకు ఏకంగా రూ.30 నుంచి రూ.70కి పెరిగింది. మొక్కజొన్న కిలో రూ.14 నుంచి రూ.23 కి పెరిగింది. ఈ క్రమంలో బ్రాయిలర్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

కొత్త బ్యాచ్‌లు వస్తేనే



45 రోజుల క్రితం పెంచిన కోళ్లు కావడంతో మార్కెట్లో ఈ ధరకు చికెన్ అమ్మగలుగుతున్నాం. వేసవి కాలానికి ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పెంపకందారులు చెబుతున్నారు. కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.190, స్కిన్ చికెన్ రూ.160 ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో స్కిన్ చికెన్ రూ.250 స్కిన్‌లెస్ అయితే రూ.290 దాకా అమ్ముతున్నాం. వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలీల ధరలు పెరిగాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచారన్న అపవాదు తప్ప మాకు వచ్చిన లాభాలేమి లేవు. –బాలాజి, రిటైల్ వ్యాపారి, గుడిపాల

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం





తగ్గువారిపల్లెలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు, ఆలయం ఆవరణలో భజన చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలోని శ్రీగోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మహాగణపతి పూజ, హోమ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం జగద్గురు శ్రీ మదివ్రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, సిద్దయ్య మూలవర్లను అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులు భజన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

అందరూ మొక్కలను విరివిగా పెంచండి



కొబ్బరి మొక్కలు అందుకున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న డైరెక్టర్ గ్లోరీ విజయ్‌కుమార్

పూతలపట్టు: ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచాలని శుచి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్ కుమార్ అన్నారు. మండలంలో వెంకటాపురం దళితవాడ, ఎగువ పాలకూర దళితవాడ, దిగువ పాలకూర కిచ్చన్నగారి పల్లె, మద్దులయ్య గారిపల్లె, అమ్మేపల్లె, ఆకనంబట్టు, క్షీరసాగరం గ్రామాల్లో సుమారు 500 మంది కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి రెండు కొబ్బరి మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ శుచి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, చేతి వృత్తి నైపుణ్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు అనేక కార్యక్రమాలు సేవలందించమన్నారు. సుమారు 500 కుటుంబాలకుగాను 1000 చెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శుచి సంస్థ కో–ఆర్డినేటర్లు ధనలక్ష్మి, జాకబ్, వరదరాజులు చిన్నయ్య, సర్పంచ్ రామతులసీ పాల్గొన్నారు

తిరుచ్చిపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి కటాక్షం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు వేద పండితులు మంగళహారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

ఉజ్వల భవితకు పునాది ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తి కాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాల వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లు జరుగుతున్నాయి సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి. ఐటీఐలు కావాల్సినంత భరోసా ఇస్తూ బంగారు భవితకు బాటలు పరుస్తున్నాయి. ఐటీఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెళకువలపై పట్టు సాధిస్తుండడంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు

జిల్లాలోని పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కో కోర్సుకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రత్యేకత చాటుకుంటుంది. కార్వేటినగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానికల్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి కోర్సులు చేసిన విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొంది స్థిరపడ్డారు.

కోర్సు మధ్యలోనే ఆన్ జాబ్ ట్రైనింగ్..

విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్ జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదువుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వంటి ప్రముఖ నగరాల్లోని వివిధ సంస్థల్లో మూడు నెలలు, ఆరు నెలలు వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టైఫండ్‌గా కొంత మొత్తం చెలిస్తుండడం గమనార్హం. కోర్సు పూర్తయిన తర్వాత అవే సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడాలనే సంకల్పంతో ఈ పద్ధతిని తీసుకొచ్చినట్లు తెలిసింది. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 264 మంది ఓజీటీకి వెళ్లారు.

కోర్సులు ఇవే..

కోపా (ఏడాది కోర్సు), మ్యాన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్(రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్(రెండేళ్లు, ఫిట్టర్(రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్(రెండేళ్లు), మెకానికల్ డీజిల్ (ఏడాది,) టర్నర్(రెండేళ్లు), వైర్‌మెన్(రెండేళ్లు), వెల్డర్(ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్(రెండేళ్లు), డ్రెస్‌మేకింగ్(ఏడాది), ప్లంబర్(ఏడాది), ఇన్‌స్టుమెంట్ మెకానిక్(రెండేళ్లు), ఐసీటీఎస్ఎం(రెండేళ్లు) మెషినిస్ట్(రెండేళ్లు) ఉంటుంది.

మెళకువలు నేర్చుకున్నా..



ఎలక్ట్రీయన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నా. నేను అమరరాజా కంపెనీలో ఓజేటీకి వెళ్లి నేను తీసుకున్న ఎలక్ట్రీషియన్ కోర్సులో కొన్ని మెళకువలు నేర్పించారు. కోర్సుతో పాటు నెలకు రూ.5 వేలు స్టైఫండ్ ఇచ్చారు.
–జ్ఞానేశ్వర్, ఎలక్ట్రీషియన్ విద్యార్థి, కార్వేటినగరం ఐటీఐ

రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చారు..



నేను ఎలక్ట్రానిక్ మెకానిక్ రెండో సంవత్సరం చదువుతున్నా. చెన్నైలోని సుందరం ఫాస్టర్స్ లిమిటెడ్ కంపెనీలో ఓజేటీకీ వెళ్లా. కర్మాగారంలో స్పేర్‌పార్ట్సు తయారు చేయడం నేరుకున్నా. నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇచ్చా.
– ఆర్.జీ జగదీష్, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం

డ్రస్ మేకింగ్ నేర్చుకున్నా..



కార్వేటినగరం ఐటీఐలో డ్రస్ మేకింగ్ నేర్చుకున్నా ఏడాదికి పూర్తిస్థాయిలో నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటి వద్దనే నేర్చుకున్న డ్రెస్ మేకింగ్‌తో ఆర్థికంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఐటీఐ కోర్సు వల్ల నా కుటుంబాన్ని పోషించుకునే ఆదాయాన్ని పొందుతున్నాను.
–దీక్షిత, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం

ఉజ్వల భవిత అందించాలనే సంకల్పం



ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్‌ల పాఠాలతో పాటు భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చాలామంది మా విద్యార్థులు పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరం. –పి.గణేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కార్వేటినగరం

ముత్యపు పందిరిలో మురిపాల రేడు



ముత్యపుపందిరి వాహనంపై కోనేటిరాయస్వామి

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపుపందిరిపై శ్రీస్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామివారు యోగ నారసింహ అవతారంలో సింహ వాహనంపై పురవీధుల్లో విహరించారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

మధ్యాహ్నం ఆస్థాన మండపంలో ఉభయదేవేరుల సహా స్వామివారి ఉత్సవమూర్తులను తులసి మాలలతో అలంకరించి పలురకాల సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అన్నమయ్య సంకీర్తనల ఆలాపన నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది.

బకాసురవధ అవతారంలో ..

రాత్రి శ్రీకృష్ణుడిగా బకాసురవధ అలంకరణలో రుక్మిణీ, సత్యభామతో కలిసి ముత్యపు పందిరి వాహనంలో పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామివారు విహరిస్తారని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.